
క్లుప్తంగా

పీఏబీఆర్‌లో నీటి మట్టం 2.9 టీఎంసీలు



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీటి మట్టం

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లో ఆదివారం నాటికి 2.906 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అవుట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో నీటి మట్టం రోజు రోజుకూ పెరుగుతోంది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ కెనాల్ ద్వారా డ్యాంలోకి 287 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. డ్యాం వద్ద ఏర్పాటైన సత్యసాయి, శ్రీరామరెడ్డి, అనంత, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు 55 క్యూసెక్కులు, నీటి ఆవిరి , లీకేజీల రూపంలో సుమారు 40 క్యూసెక్కులు చొప్పున రోజుకు అవుట్ ఫ్లో ఉంది.

సామాజిక తనిఖీ ప్రారంభం



ఖైరేవులో సామాజిక తనిఖీ చేస్తున్న దృశ్యం

శెట్టూరు: మండలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనులకు సామాజిక తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి వరకు జరిగిన పలనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16 గ్రామ పంచాయతీల నుంచి 832 పనులకు అప్పటి ప్రభుత్వం ఈజీఎస్ కింద రూ. 9 కోట్ల 36 లక్షలు, పీఆర్‌లో రూ. 1 కోటీ 44 లక్షలు పనులకు వెచ్చించినట్లు తెలిపారు. అనుంపల్లిలో 95 పనులకుగాను రూ. 1కోటి పైగాను, అత్యల్పంగా ఐదుకల్లులో రూ.25, లక్షలతో పనులు జరిగినట్లు తెలిపారు. ఒక ఎస్ఆర్పీ, 12 మంది డీఆర్పీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. తనిఖీపై గ్రామాల్లో 6 నుంచి 11 వరకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

కంబదూరు: కంబదూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపాల్ డిమాండ్ చేశాడు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల జిల్లాలో కరువు మండలాలను ప్రకటించిందన్నారు. కరువు మండలాల జాబితాలో జిల్లాలో అత్యంత వెనుకబడి, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న కంబదూరు మండలం లేకపోవడం అన్యాయమన్నారు. మండలంలో చాలా మంది రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం కంబదూరును కరువు మండలంగా ప్రకటించకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చండి

కూడేరు: దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ట్రాన్స్‌కో ఏఈ గౌస్‌కు కొర్రకోడు సర్పంచ్ చంద్రశేఖర్ (వైఎస్సార్ సీపీ), గ్రామస్తులు ఆదివారం విన్నవించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీ చిన్నారులకు, ప్రజలకు విద్యుత్ ప్రమాదం పొంచి ఉందని, దెబ్బతిన్న స్తంభాలను మార్చాలని విన్నవించారు.

ఏకగ్రీవంగా కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ ఎన్నికలు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ 2024–2027 ఎన్నికలు ఆదివారం జరిగాయి. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ (ఏపీఆర్ఎస్ఏ) కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా రత్నశ్యామ్‌రాయ్(డీటీ బొమ్మనహాళ్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సుబ్రహ్మణ్యం (ఎమ్మెల్యే పాయింట్), వైస్ ప్రెసిడెంట్–1 బసవకుమార్ (డీటీ, డీహీరేహాళ్), వైస్ ప్రెసిడెంట్–2గా విజయలక్ష్మి (డీటీ, గుమ్మఘట్ట), వైస్ ప్రెసిడెంట్–3గా తిప్పేస్వామి (డీటీ, కుందుర్పి), సెక్రెటరీగా గురుబ్రహ్మ (రీసర్వే డీటీ, కుందుర్పి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా గౌతమ్ (ఆర్ఐ, శెట్టూరు), జాయింట్ సెక్రటరీ–1గా నాగిరెడ్డి (ఆర్ఐ బ్రహ్మసముద్రం),జాయింట్ సెక్రటరీ–2గా తలారి వెంకటేశులు (సీనియర్ అసిస్టెంట్ కళ్యాణదుర్గం), జాయింట్ సెక్రటరీ –3గా శ్రీనివాసులు నెహ్రూ (డ్రైవర్, ట్రెజరర్‌గా వెంకటేశులు (డీటీ, కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం)ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

వేరుశనగ రైతుకు నష్టాల మూట

- దిగుబడి తగ్గింది.. ధర లేదు
- భారీ వర్షానికి పొలాల్లోనే కుళ్లిపోయిన పంట
- పొలాల్లోనే నిల్వ చేసిన వేరుశనగ
- కొనుగోలు చేసేందుకు ముందుకు రాని వ్యాపారులు



రైతు విజయ భాస్కర్ రెడ్డి పొలంలోనే వేరుశనగకాయలను నిల్వ ఉంచిన దృశ్యం

నియోజకవర్గం పేరు	ఎకరాల్లో (సుమారు)
ఉరవకొండ	11,200
కళ్యాణదుర్గం	9,800
రాయదుర్గం	10,500

కూడేరు: ఏటా ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసి నష్టాలు చవిచూస్తున్న రైతులు.. ఈ ఏడాది అయినా దిగుబడి వస్తుందని ఆశ పెట్టుకుంటే.. దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది. ధర తగ్గిపోయింది. పంట కోత దశకు రావడంతో నూర్పిడి చేసి రైతులు వేరుశనగ కాయలను అమ్మడానికి సిద్ధం చేసుకుంటున్నారు. దీనికితోడు ఇటీవల భారీ వర్షాలు రైతును నట్టేట ముంచాయి. తొలగించిన పంట పొలంలోనే నల్లబారిపోయింది. మరోవైపు మార్కెట్లో వేరుశనగ ధర తగ్గిపోయింది. వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు దిగాలు చెందుతున్నారు.

నాణ్యతను బట్టి ధర ..

ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. వేరుశనగ సాగుకు ఎకరాకు రూ.20 వేలు వరకు పెట్టుబడి అవుతోంది. దిగుబడి బాగుంటే ఎకరాకు 30 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. కానీ ప్రస్తుతం 22 బస్తాలు లోపలే ఉంది. దిగుబడి బాగా ఉంటే ఎకరాకు 30 బస్తాలు (42 కేజీలు) అవుతాయి. కానీ ప్రస్తుతం 20 బస్తాలు లోపే దిగుబడి ఉంటోంది. తుఫానుతో తొలగించిన పంట కాయలతో సహా పలువురి రైతులవి పొలాల్లోనే తడిసి వేరుశనగ కట్టె, కాయలు నల్లబడ్డాయి. గత 20 రోజుల క్రితం మార్కెట్లో వేరుశనగకాయల నాణ్యత బట్టి క్వింటా రూ.7వేల నుంచి రూ.8 వేలు ఉండేది. కానీ ప్రస్తుతం వేరుశనగ కాయ నాణ్యత బట్టి క్వింటా రూ.5,500 వరకు ఉంది. కానీ ఇటీవల కురిసిన తుఫాన్‌కు అనేక మంది రైతుల పొలాల్లో తొలగించిన వేరుశనగ పంట తడిసింది. వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు పొలాల్లోనే వేరుశనగ కాయలను వర్షానికి తడవకుండా పట్టలు కప్పి నిల్వ ఉంచుకున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరతో వేరుశనగ కాయలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజక వర్గాల్లో వేరుశనగ పంట సాగు ఇలా ఉంది..

తగ్గుతున్న సాగు విస్తీర్ణం:

ఏటేటా వేరుశనగ పంట పెట్టుబడి పెరిగిపోతోంది. దీనికితోడు ధరలు పెరిగిపోతున్నాయి. దీంతో రైతులకు ఆర్థికంగా మరింత భారమవుతోంది. ఫలితంగా ఏటా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. కాడెద్దులు లేవు. వ్యవసాయ పనులు, విత్తనం విత్తేందుకు రైతులు యంత్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయి. నివారణకు మందులు పిచికారీ అధికంగానే ఉంటోంది. దీంతో ఒక ఎకరాలో వేరుశనగ పంట సాగు చేయాలంటే సుమారు రూ.20 వేల నుంచి రూ. 25 వేలు వరకు పెట్టుబడి అవుతోంది.

వర్షాభావం, తెగుళ్లతో తగ్గిన దిగుబడి..


ఈ ఏడాది సరిగా వర్షాలు కురవలేదు. బోరుబావుల్లోనూ భూగర్భజలాలు తగ్గిపోయాయి. నీటి కొరతతో వేరుశనగ పంటకు రైతులు నీటి తడులు సక్రమంగా ఇవ్వలేకపోయారు. దిగుబడిపై ప్రభావం పడింది. దీంతో వేరుశగన కాయ బరువు తగ్గింది. మరోవైపు పంటకు లద్దె పురుగు, ఆకుమచ్చ తెగులు, కుంకుమ తెగులు, పచ్చ పురుగు ఆశించడంతో దిగుబడి తగ్గిపోయింది. నీటి తడులు సక్రమంగా అంది, తెగుళ్లు రాకుండా ఉంటే ఎకరాకు 25 బస్తాలు (బస్తా 42 కేజీలు) వరకు దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుతం 16 నుంచి 18 బస్తాలలోపు దిగుబడి వచ్చింది.

గిట్టుబాటు ధర కల్పించాలి



రూ.1.30 లక్షలు పెట్టి వేరుశనగ పంటను ఐదెకరాల విస్తీర్ణంలో సాగు చేశా. దిగుబడిపై ఆశలు పెట్టుకున్నా. తెగుళ్లు సోకితే రూ.వేలు పెట్టి మందులు పిచికారీ చేశా. 10 రోజల క్రితం పంటను తొలగించి యంత్రం ద్వారా నూర్పిడి చేశా. దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. మార్కెట్లో ధర బాగా తగ్గిపోయింది. కొనడానికి వ్యాపారులు రావడంలేదు. పొలంలోనే కాయలను నిల్వ ఉంచుకున్నా. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి. – విజయ భాస్కర్‌రెడ్డి, రైతు, కూడేరు

పంట సాగుకు రూ.1.5 లక్షలు వెచ్చించా



ఆరు ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టి వేరుశనగ పంట సాగు చేశా. వారం రోజుల క్రితం పంట నూర్పిడి చేశా. కానీ దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. 40 బస్తాలు వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్లో ధర క్వింటా రూ.5,200 ఉంది. కానీ కొనుగోలుదారులు ఎవరూ రావడం లేదు. వర్షానికి తడుస్తాయని వేరుశనగ కాయలను ఇంటికి తరలించా. ధర పెరుగుతుందన్న ఆశతో ఉన్నా. – ఈశ్వరయ్య, రైతు చోళసముద్రం, కూడేరు మండలం

పంట దిగుబడి తగ్గింది



బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి తగ్గింది. దిగుబడి బాగుంటే ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు వస్తుంది. కానీ ప్రస్తుతం 5 నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. జింక్ సల్ఫేట్ 20 కేజీలు, బోరాన్ 10 కేజీలు, పొటాషియం 30 కేజీలు, నత్రజని 24 కేజీలు, జిప్సం 200 కేజీలు చొప్పున ఎకరాకు దుక్కి సమయంలో వేస్తే అధిక దిగుబడి వస్తుంది. – విజయకుమార్, ఏఓ, కూడేరు

శుభకార్యం



వివాహ వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కరణం ఫంక్షన్ హాలులో శెట్టూరు మండలం యాటకల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరప్ప కుమారుడు మహేష్, సహితల వివాహ వేడుకలు ఆదివారం జరిగాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, నియోజకవర్గ నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు బోయ తిప్పేస్వామి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రఘునాథ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి, సర్పంచులు ఈరన్న, ప్రకాష్, ఎంపీటీసీ నాగమణి, మాజీ ఎంపీపీ రామాంజనేయలు, నాయకులు తలారి సత్తి, గోళ్ల సూరి, గంగాధర్, హరినాథ్ రెడ్డి, భీమేష్, రామకృష్ణ, రామప్ప, షేక్షా, సత్తి రెడ్డి, పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న తలారి రంగయ్య

బైక్ దొంగ అరెస్ట్

కణేకల్లు: బైక్ చోరీ చేసిన కేసులో కణేకల్లు మండలం పూలచెర్ల గ్రామానికి చెందిన తలారి మారుతిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు. కణేకల్లులోని ఉరవకొండ రోడ్డులో మెయిన్‌రోడ్డు పక్కన అక్టోబర్ 30న పార్కింగ్ చేసిన డిస్కవర్ బైక్ చోరీకి గురైందన్నారు. బాధితుడు సయ్యద్ ఖాద్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో తలారి మారుతిని శనివారం రాత్రి పుల్లంపల్లి గేట్ వద్ద అరెస్ట్ చేసి, చోరి చేసిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

కల్లుదేవనహళ్లి కల్వర్టును నిర్మించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అనంత, మెట్టు గోవిందరెడ్డి



సర్పంచు గాదిలింగకు ఆర్థికసాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అనంత, మెట్టు

బొమ్మనహాళ్ : వరద ఉధృతికి తెగిపోయిన కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే చేపట్టాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి కోరారు. ఆదివారం భారీ వర్షానికి కల్లుదేవనహళ్లి వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు, రోడ్డును వారు పరిశీలించారు. కల్వర్టు కూలిపోవడం వల్ల ఉరవకొండ, బళ్లారి, బొమ్మనహాళ్‌కు తదితర 30 గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ కూలీలు కూడా కల్వర్టు దాటి పొలాల్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. వరద ఉధృతి తగ్గిన కూడా అధికారులు కనీసం కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించకపోలేదన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కార్యకర్తలు ఏ ఒక్కరూ అధైర్యపడొద్దు..అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి భరోసాకల్పించారు. ఆదివారం ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడిన బొల్లనగుడ్డం గ్రామ సర్పంచ్ గాదిలింగను రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డితో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచు ఆస్పత్రి ఖర్చులకు మెట్టు గోవిందరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, మంచి చేస్తే ప్రజలు గుర్తు పెట్టుకుంటారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచులు పరమేశ్వర, వన్నూరుస్వామి, కోటేశ్వరరెడ్డి, రామకృష్ణ, నుంకేష్, నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, లోకేష్, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, పరమేశ్వర, వెంకటేశులు, బసవరాజు, కోటేశ్వరరెడ్డి, నుంకేష్, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో కనీస సౌకర్యాలు కరువు



శాంతినగర్‌లో ఎండలోనే సరుకులు విక్రయిస్తున్న వ్యాపారులు

రాయదుర్గంటౌన్: పట్టణ పరిధిలోని వారపుసంతలో కనీస సౌకర్యాలు కల్పించక వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు.పట్టణంలో దాదాపు 70 వేలకు పైగా జనాభా ఉంది. ఇందులో సగం మంది శాంతినగర్ సంతలో, మరోసగం మంది ఓబుళాచారి రోడుల్లో జరిగే సంతకు వెళ్తారు. రైతు బజారు లేకపోవడంతో కొనుగోలుదారులు సంతలపైనే ఆధారపడాల్సి వస్తోంది. సంత జరిగే రెండు ప్రాంతాల్లోనూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పండించిన ఉత్పత్తులను వందలాది మంది రైతులు తెచ్చి విక్రయిస్తుంటారు. వ్యాపారులు నీడ, తాగు నీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. వేసవిలో వ్యాపారుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది. వర్షం వచ్చిందంటే వ్యాపారుల పరిస్థితి వర్ణనాతీతం. కూరగాయలు, సరుకులు విక్రయించేందుకు ఎలాంటి షెడ్లు, గాని షామియానాలను గాని ఏర్పాటు చేయలేదు.

పాములతో భయం..భయం



కూడేరు:పీహెచ్‌సీలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు



కూడేరు: ఎంపీడీఓ కార్యాలయంలో పబ్లిక్ జిమ్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

కూడేరు: 'స్వచ్ఛ భారత్ హీ సేవ' కార్యక్రమంలో భాగంగా రెండు నెలల క్రితం అధికారులు ప్రచార ఆర్భాటం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు ఉపన్యాసాలు ఊదరగొట్టారు. కానీ ప్రభుత్వ కార్యాలయ వద్ద అపరి శుభ్రత తాండవిస్తున్నా, పిచ్చి మొక్కలు పెరిగినా తమకేమీ పట్టనట్లు ఉన్నారు. కూడేరులో పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అందులో నుంచి విష పురుగులు బయటకు రావడంతో వైద్యం కోసం వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు మార్లు విష పురుగులను చంపేశారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రధాన గేటు పక్కనే పబ్లిక్ జిమ్ చుట్టూ , అదే ఆవరణలో ఉన్న వెలుగు కార్యాలయం కార్యాలయానికి వెళ్లే గేటు ముందు, సచివాలయం1,2, రైతు సేవా కేంద్రం, హౌసింగ్ కార్యాలయంలోకి వెళ్లే దారికి మోకాలు ఎత్తు పిచ్చి మొక్కలు పెరిగాయి. జిమ్‌కు, ఆయా కార్యాలయాలకు పనుల నిమిత్తం అధిక సంఖ్యలో మండల ప్రజలు వస్తుంటారు. పాములు తిరుగుతుండడాన్ని చూసి ప్రజలు భయం..భయంతో వెళుతున్నారు. అధికారులు స్పందించి ఆయా కార్యాలయాల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎంపీడీఓ కార్యాలయానికి అటెండర్లే దిక్కు!

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సిబ్బంది లేక ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఎంపీడీఓ కార్యాలయం

కంబదూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సిబ్బంది కొరత వేధిస్తోంది. పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించకపోవడంతో పాటు ఉన్న అధికారులు సక్రమంగా విధులకు రాకుండా డుమ్మా కొడుతుండడంతో కార్యాలయంలో పని చేసే ముగ్గురు అటెండర్లే కార్యాలయానికి దిక్కు అయ్యింది. మంగళవారం ఉదయం 11:30 గంటలైనా కార్యాలయానికి ఒక్క అధికారి కూడా రాకపోడంతో కార్యాలయం వెలవెలబోయింది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడికి రెగ్యులర్ ఎంపీడీఓను నియమించకపోవడంతో కళ్యాణదుర్గం ఎంపీడీఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఆయన కనీసం ఇటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. అడ్మినిస్ట్రేషన్ అధికారి జిల్లా పరిషత్ కార్యాలయానికే పరిమితమవుతున్నారు. ఈఓపీఆర్డీ వచ్చి క్యాంపుల పేరుతో వెళ్లిపోతున్నారు. ఇక సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి అధికారులైన సక్రమంగా విధులకు వచ్చేలా చూడాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరగాద్రి బాలోత్సవ పోటీలు ప్రారంభం



బాలోత్సవ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉరవకొండ: నవంబర్ 14న జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉరగాద్రి బాలల దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు విద్యార్థులకు చెస్, చిత్రలేఖనం, వ్యాసరచ, క్విజ్ పోటీలు నిర్వహించారు.ఆదివారం స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు ప్రారంభించారు. గణిత ఉపాధ్యాయుడు, నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్ తాడికొండ మాట్లాడుతూ జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వ్యాసరచన పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న విద్యార్థులు

శివాలయాల్లో కార్తీక పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో ఆదివారం కార్తీకమాస పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వజ్రకరూరులోని నగరేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషే కం, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకుని కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. జరుట్లరాంపురం గ్రామంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పూజలు చేశారు. కొనకొండ్ల గ్రామంలోని ఛాయా మల్లేశ్వర స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

భక్తుల కొంగు బంగారం.. జోడు లింగాల సంగమేశ్వరం



శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి

కూడేరు: కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం. పుట్ట శిలతో ఉన్న శివుడిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని భక్తుల అపార నమ్మకం. భక్తుల కొంగు బంగారంగా కూడేరులో వెలసిన పుట్టశిలలైన శివపార్వతుల జోడు లింగాలు నిలిచాయి. సంగమేశ్వర స్వామి ఆలయం 16వ శతాబ్దం నాటిదిగా ఆలయ పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ వెలసిన శివపార్వతుల జోడు లింగాలు సుమారు 172 అడుగులు లోపలికి పాముల వలె పెనువేసుకుని ఉన్నట్టు భూగర్భ గనుల శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఆలయం దక్షిణ భారత దేశంలో ప్రఖ్యాతి గాంచిన శైవ క్షేత్రాల్లో ఒక్కటిగా నిలిచింది. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు దేవదాయ శాఖ అధికారులు, ఆలయ జీర్ణోద్ధరణ, సేవా కమిటీ సభ్యులు చర్యలు చేపడుతున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి



భర్తతో భవాని (ఫైల్)

కూడేరు: ఉదిరిపికొండకు చెందిన సిద్ధార్థ భార్య భవాని (30) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. భవాని ఒంటిపై కిరోసిన్ పోసుకొని శుక్రవారం నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం విదితమే. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఎంపీపీ, ప్రిన్సిపాల్

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం గురుకులంలో ఆవరణలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఎంపీపీ వెలిగొండ నరసింహులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన, పీఈటీ మీనాలు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన సీనియర్ షూటింగ్ బాల్ విభాగంలో పదో తరగతి విద్యార్థినులు అలేఖ్య, అనిత, సాహితీ, కీర్తన, జూనియర్ విభాగంలో వహితలు మొత్తం ఐదుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఎంపీపీతో పాటు మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, గ్రంథాలయ అధికారిణి కుల్లాయమ్మ ప్రత్యేకంగా అభినందించారు.